క్లుప్తంగా

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కె.కోటపాడు :విద్యార్థులు పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని లంకవానిపాలెం పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ హిక్సినా, హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్ అన్నారు. ఎ.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనారోగ్యంతో గల విద్యార్థులకు మందులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ శాంతి, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శాకంబరిగా వాసవీమాత



పూజలు చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

మాడుగుల రూరల్: మండలంలోని జంపెనలో వాసవీమాతను శాకంబరిగా శుక్రవారం అలంకరించారు. ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని, అమ్మవారిని వివిధ కూరగాయలతో అలంకరించి, పూజలు చేశారు. కింతలి-గాదిరాయి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాలకుర్తి సురేష్ కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ మేడిశెట్టి అర్జునరావు, వైస్ చైర్మన్ కె.గున్నయ్యశెట్టి, జిల్లా వాసవీ క్లబ్ సభ్యులు శ్రీనాధు కన్నయ్యశెట్టి పాల్గొన్నారు.

శ్లాబ్ పెచ్చులు రాలి ఫ్యాన్సీ షాప్ సామగ్రి ధ్వంసం



ఫ్యాన్సీ షాపులో రాలిపడిన శ్లాబ్ పెచ్చులు

దేవరాపల్లి: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న యానాపు ఫ్యాన్సీ షాపులో శుక్రవారం తెల్లవార జామున శ్లాబ్ పెచ్చులు రాలిపడడంతో సామగ్రి ధ్వంసమైంది. ఇటీవల కురిసన వర్షాలకు శ్లాబ్ నుంచి పెద్ద పెచ్చులు ఒక్కసారిగా పడ్డాయి. సుమారు రూ. 50 వేల మేర ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు కృష్ణ తెలిపారు.

అంకిత భావంతో పనిచేసిన గురువులకు ప్రత్యేక గుర్తింపు



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎంపీపీ బుల్లిలక్ష్మి, సర్పంచ్ చింతల

దేవరాపల్లి: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసే ఉపాధ్యాయులకు సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని స్థానిక ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి అన్నారు. ఎ. కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను స్థానిక హెచ్ఎం కల్యాణి ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. ఇక్కడ హెచ్ఎంగా పని చేసిన వై. స్వర్ణలత, ఆంగ్ల ఉపాధ్యాయుడు పెద్దాడ వెంకటరమణ, ఫిజిక్స్ ఉపాధ్యాయుడు వి.బి.ఎస్. శ్రీనివాసరావు, హిందీ టీచర్ కె.రాజేశ్వరి, మ్యాథ్స్ టీచర్ రామకృష్ణను ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, స్థానిక సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

మాంసం దుకాణాలను తొలగించాలి



ఎంపీడీవో,ఏవోలను నిలదీస్తున్న ప్రజా ప్రతినిధులు

రావికమతం: కొత్తకోటలో సాయిబాబా మందిరం, వీరబ్రహ్మం గారి దేవాలయం,గ్రంథాలయం సమీపంలో ఉన్న మాంసం దుకాణాలను వెంటనే తొలగించాలని సర్పంచ్ లోవరాజు, వైస్ సర్పంచ్ పందల దేవ, ఎంపీటీసీ పూడి దేవ, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ సత్యదేవ,గున్నాజీ తదితరులు కొత్తకోట గ్రామాన్ని సందర్శించిన ఎంపీడీవో వెంకన్నబాబు,ఏవో స్వామిలను డిమాండ్ చేశారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని వారు ప్రశ్నించారు. తక్షణమే మాంసం దుకాణాలు తొలగించక పోతే కలెక్టర్‌కు ఫిర్యాదుకు చేస్తామన్నారు. దీనిపై ఎంపీడీవో వెంకన్నబాబు,ఏవో స్వామి మాట్లాడుతూ రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం

రావికమతం: ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది తెలిపారు.రావికమతం మండలం దొండపూడి,కొత్తకోట గ్రామాల్లో గల పొలాల్లో శుక్రవారం రైతులకు బీజామృతం తయారీ తదితర అంశాలపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గుణావతి,స్వాతి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది లావణ్య,దొరబాబు,లక్ష్మి,స్వాతి పాల్గొన్నారు.

విధులకెళ్లాలంటే.. గొడుగులు పట్టాల్సిందే

- వర్షాలకు కారిపోతున్న ఎంఈవో కార్యాలయ భవనం
- చిత్తడిగా మారుతున్న గదులు
- శ్లాబ్ నుంచి రాలుతున్న పెచ్చులు
- ఇబ్బందులు పడుతున్న మండల విద్యాశాఖాధికారులు, సిబ్బంది



ఎంఈవో గదిలోనికి శ్లాబ్ నుంచి కారుతున్న వర్షం నీరు



వర్షపునీటితో చిత్తడిగా మారిన కంప్యూటర్ గది



సమావేశ మందిరంలో లీకేజీ అవుతున్న శ్లాబ్

కె.కోటపాడు : స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయ భవనం అధ్వానంగా దర్శనమిస్తోంది.చిన్నపాటి వర్షానికే శ్లాబు నుంచి నీరు కారుతుండడంతో ఉద్యోగులు అవస్థలకు గురవుతున్నారు. ఇటీవల వారం రోజుల పాటు కురిసిన ముసురుతో కూడిన వర్షాలకు భవనం శ్లాబ్‌లో బీటలు వారిన ప్రాంతం నుంచి నీరు గదుల్లోకి లీకవుతోంది. ఎంఈవోలు ఉండే గదితో పాటు కంప్యూటర్ సిబ్బంది గది, సమావేశ మందిరంలో నీరు కారుతోంది. మండల విద్యాశాఖ కార్యాలయంలో అందుబాటులో ఉన్న మూడు గదుల్లోనూ శ్లాబ్ నుంచి వర్షపునీరు కారుతుండడంతో విధులు నిర్వహించేందుకు సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. మరో పక్క శ్లాబ్ నుంచి పెచ్చులు రాలిపడుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. మండలంలో 42 ప్రాథమిక పాఠశాలలు, నాలుగు మోడల్ ప్రైమరీ స్కూళ్లు, ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో సుమారు మూడు వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. 160 ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఈ ప్రభుత్వ పాఠశాలల రికార్డులతో పాటు ఉపాధ్యాయుల పూర్తి వివరాలు ఈ కార్యాలయంలోనే భద్రపరుస్తారు. వర్షాల కారణంగా శ్లాబ్ కారిపోతుండడంతో రికార్డులు పాడైపోతాయేమోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. 1995లో ఈ భవనాన్ని నిర్మించారు. అప్పటి నుంచి నిర్వహణ పనులు చేపట్టకపోవడం వల్ల భవనం బలహీనమై శ్లాబ్ నుంచి పెచ్చులురాలి పడి వర్షపు నీరు కారుతోంది.

అధికారుల దృష్టికి భవనం సమస్య



మండల విద్యాశాఖ భవనం యొక్క పరిస్థితిని ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్‌కు వివరించాం. కార్యాలయ మరమ్మతు పనులకు నిధులను కేటాయించాలని ఇటీవల నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ రెడ్డి జగన్ మోహన్... అధికారులకు సూచించారు. మండల విద్యాశాఖ కార్యాలయానికి మరమ్మతులు చేస్తే రాబోయే వర్షాకాలంలో ఎటువంటి సమస్య ఉత్పన్నం కాకుండా ఉంటుంది.
–కె.సత్యనారాయణ, ఎంఈవో, కె.కోటపాడు.

సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకు ?

- రోలుగుంట మండల సమావేశంలో అధికారులను నిలదీసిన సభ్యులు



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసరావు

రోలుగుంట: సమస్యలు ప్రస్తావించడమే తప్ప పరిష్కారానికి నోచుకోవడం లేదని, అలాంటప్పుడు సమావేశాలు నిర్వహించడం ఎందుకని మండల ప్రజాప్రతినిధులు విమర్శించారు. రోలుగుంట మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు పలు సమస్యలు లేవనెత్తారు. జల్‌జీవన్ మిషన్ పథకం కింద వేసిన పైపులైన్ల నుంచి నీరులీకవుతోందని రోలుగుంట, మరికొన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకెళ్లారు. జిరాయితీ భూములు వెబ్‌ల్యాండులో ఇనాం భూములుగా నమోదు కావడంతో క్రయవిక్రయాల్లో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కె.నాయుడుపాలెం సర్పంచ్ గుములూరి సన్యాసినాయుడు తహసీల్దార్ నాగమ్మను కోరారు. పర్యవేక్షణ లేకపోవడంతో ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలు జరుగుతున్నాయని నిండుగొండ సర్పంచ్ శెట్టి సంధ్య, కుసర్లపూడి సర్పంచ్ మద్దు అప్పలనాయుడు ఆరోపించారు. కుసర్లపూడి జగనన్న కాలనీలో విద్యుత్ సౌకర్యం లేక కాలనీ వాసులు ఇబ్బందులకు గురవుతున్నారని ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీపీ శ్రీనివాసరావు కలుగజేసుకొని సభదృష్టికి వచ్చిన సమస్యలపై అధికారులు పరిష్కారం చూపాలన్నారు. సమావేశానికి ముందు అల్లూరి సీతారామ రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో వి.ఎస్. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విస్తృస్థాయి సమావేశం రేపు



పార్టీ నాయకులతో సమావేశమైన ఎంపీపీ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ లక్ష్మీ రమణమ్మ

రోలుగుంట: మండల కేంద్రం రోలుగుంటలో ఈ నెల 6 వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ఎంపీపీ తన చాంబర్‌లో జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మతో కలసి మండలస్థాయిలో నాయకులు,కార్యకర్తలతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విస్తృతస్థాయి సమావేశం విజయవంతానికి అందరూ కృషి చేయాలన్నారు. ముఖ్యఅతిథులుగా పార్టీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్, పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయ కర్త కరణం ధర్మశ్రీ పాల్గొంటారని, ఆరోజు వారిని బైక్ ర్యాలీతో స్వాగతం పలుకుతామని చెప్పారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు టి.వి.రమణ, పోతల లక్ష్మీశ్రీనివాస్, వైస్ ఎంపీపీ -1 కొల్లు సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ -2 దోసపత్ని వరలక్ష్మి, మద్దు అప్పలనాయుడు, సర్పంచ్‌లు గుములూరి బాబులు, చెట్టుపల్లి వెంకటరావు, పాచిలి రామకృష్ణ, రాజశేఖర్, బగుదు వెంకటరమణ, లగుదు కృష్ణంనాయుడు, బంటు సూర్యసన్యాసి దేముళ్లు, చిటికెల పద్మ, శెట్టి సంధ్య, ఎంపీటీసీ వద్దాది సతీష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణునిగా జగన్నాథస్వామి



చోడవరం: జగన్నాథస్వామి శుక్రవారం శ్రీకృష్ణుని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జగన్నాథస్వామి ఉత్సవాల్లో భాగంగా స్థానిక బోళ్లవీధిరామాలయంలో 8వరోజు స్వామివారిని శ్రీకృష్ణునిగా అలంకరించి ఆలయ అర్చకులు సీతారామాచార్యులు, రామకృష్ణాచార్యులు పూజలు చేశారు.

అల్లూరి పోరాటం యువతకు స్ఫూర్తిదాయకం



చీడిగుమ్మలలో నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ గిరిబాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి రామునాయుడు



నర్సీపట్నంలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



అల్లూరి విగ్రహంవద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ అప్పలనర్స



మాడుగులలో నివాళులర్పిస్తున్న పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పడాల అప్పల నాయుడు



దుస్తులు పంపిణీ చేస్తున్న గోవాడ సుగర్స్ ఎండీ వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సత్యారావు

కె.కోటపాడు : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితం ఆదర్శనీయమని, ఆయన తెల్లదొరలపై సాగించిన పోరాటం యువతకు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు తెలిపారు. వాడవాడలా అల్లూరి జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించి, నివాళులర్పించారు. కె.కోటపాడులో వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ అల్లూరి విగ్రహానికి పూలమాలను వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు ఆశయాలను యువత కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.దేముడునాయుడు, గండి సత్యం, పాచిల శ్రీను, చిరికి రామారావు, పాచిల చిరంజీవి, రొంగలి శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ...

నర్సీపట్నం:వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం పలువురు జాతీయ స్వాతంత్ర్య సమర యోధుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. పెదబొడ్డేపల్లి వైఎస్సార్ ట్యాంక్ బండ్ వద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వర్ధంతి సందర్భంగా జాతీయ జెండా రూపకర్త పింగళ వెంకయ్య, స్వామి వివేకానంద విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సూచన మేరకు జరిగిన ఈ కార్యక్రమాల్లో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏకా శివ, పార్టీ నాయకులు పెట్ల అప్పలనాయుడు, తమరాన శ్రీను, కర్రి శ్రీను, బేతిరెడ్డి విజయ్ యాదగిరి శేషు, షేక్ రోజా, చీటిల రాము, సుదీర్, కణితి వాసు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. కళాశాలలోని అల్లూరి విగ్రహానికి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. రాజు, అధ్యాపకులు పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్, కౌన్సిలర్ శ్రీకాంత్ బహుమతులు అందజేశారు. శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి దమయంతి, పాఠకులు అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, నాయకులు ఎన్టీఆర్ స్టేడియంలోని అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలేపల్లి వెంకటరమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు గొల్లు గురుబాబు, డీసీహెచ్ క్రాంతి, అంకంరెడ్డి చిన్నంనాయుడు, చోడే శ్రీనివాసరావు, నల్లబెల్లి శ్రీరామ్మూర్తి తదిరులు పాల్గొన్నారు.

చోడవరం: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయసాధనకు యువత కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏడువాక సత్యారావు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. అల్లూరి విగ్రహానికి గోవాడ సుగర్స్ ఎండీ వెంకటేశ్వరరావు పూల మాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పేదలకు దుస్తులు, గ్రామస్తులు, సుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గోవాడ కోఆపరేటివ్ బ్యాంక్ మాజీ అధ్యక్షుడు బెహరా సత్యారావు,ఉప సర్పంచ్ మజ్జి ఏడువాక నాగేశ్వరరావు, మజ్జి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. చోడవరంలో ప్రజానంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన అల్లూరి జయంతి కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి. వెంకన్న, ఎస్.వి. నాయుడు, యర్రా దేముడు, జి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చోడవరం నియోజకవర్గంలో రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయని, అధికార పార్టీ ఎమ్మెల్యే నిమ్మకు నీరెత్తనట్టు వ్యవహరిస్తున్నారని వారంతా ధ్వజమెత్తారు.

దేవరాపల్లి:మండలంలోని రైవాడ పంచాయతీ శివారు బేతపూడిలో అల్లూరి సీతారామరాజు జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అల్లూరి విగ్రహానికి స్థానిక మాజీ సర్పంచ్ మూలగుమ్మి ఈశ్వరమ్మ, విగ్రహ దాత చెల్లిబోయిన కృష్ణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేవరాపల్లి తహసీల్దార్ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి స్థానిక తహసీల్దార్ పి.లక్ష్మీదేవి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: మండలంలోని బుచ్చెయ్యపేట, వడ్డాది,సీతయ్యపేట,రాజాంలలో అల్లూరి జయంతిని ఘనంగా నిర్వహించారు.

గొలుగొండ: చీడిగుమ్మలలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు, సీపీఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాకవరపాలెం: అల్లూరి జయంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి డిప్యూటీ తహసీల్దార్‌లు కె.నూకరాజు, కృష్ణమూర్తి, రెవెన్యూ సిబ్బంది, తామరంలో తూర్పుకాపు సంఘ మండల అధ్యక్షుడు హరిబాబు, బీజేపీ నేత రాంబాబు నివాళులర్పించారు. తామరంలోని అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన అల్లూరి జయంతి కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల: స్థానిక పాత బస్టాండ్‌లో గల అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి పలువురు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎం.కోడూరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పడాల అప్పల నాయుడు, మండల సతీష్, గౌరీపట్టపు వెంకటరమణ, సుందర రాజు, పుట్టా బలరామ్, పాము వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి ఆశయసాధనకు కృషి

నాతవరం:అల్లూరి సీతారామరాజు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. స్థానిక హైస్కూల్‌లో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, రాష్ట్ర పామాయిల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పైల పోతురాజు ఆధ్వర్యంలో అల్లూరి జయంతి వేడుకలు నిర్వహించారు. అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద అల్లూరి విగ్రహానికి తహసీల్దార్ వేణుగోపాల్, రామన్నపాలెంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బండి గంగరాజు పూలమాలలు వేశారు. ఎంఈవో కామిరెడ్డి వరహాలబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, నాతవరం సర్పంచ్ గొలగాని రాణి, మాజీ ఎంపీపీలు పారుపల్లి కొండబాబు, నేతల విజయకుమార్, హైస్కూల్ హెచ్ఎం కూండ్రపు సత్యనారాయణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టరు ఇట్టంశెట్టి సీతారామమూర్తి , నూకాలమ్మ తల్లి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ అంకంరెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట: మండలంలోని కుసర్లపూడిలో అల్లూరి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు యువజన సంఘం నాయకులు అప్పల సీతయ్యనాయుడు, సాంబమూర్తి, సర్పంచ్ మద్దు అప్పలనాయుడు పాల్గొన్నారు. బుచ్చింపేటలో వార్డు కార్యదర్శి అనమిరెడ్డి రమణ ఆధ్వర్యంలో అల్లూరి జయంతి కార్యక్రమం నిర్వహించారు.



అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తూర్పుకాపు సంఘ మండల అధ్యక్షుడు హరిబాబు



నర్సీపట్నం డిగ్రీ కళాశాలలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ రాజు



పాచిలవానిపాలెంలో నివాళులర్పిస్తున్న వైస్ ఎంపీపీ సూర్యనారాయణ

అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు



భాను పుష్పలీలావతిని సన్మానిస్తున్న వీహెచ్ఏలు, వీఏఏలు

మాడుగుల రూరల్: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించే ఉద్యోగులకు సమాజంలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని చోడవరం డివిజన్ వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు వి. రవీంద్రనాథ్ అన్నారు. విశాఖ జిల్లా భీమునిపట్నం ఎంహెచ్‌వోగా బదిలీ అయిన స్థానిక మండల ఉద్యానవనశాఖాధికారి వి.భాను పుష్పలీలావతిని శుక్రవారం చోడవరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సన్మానించారు. ఈ సమావేశంలో ఏడీ రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి బదిలీ అనేది సాధారణమని, పనిచేసే ప్రాంతంలో కిందస్థాయి ఉద్యోగులు, ఇతర సిబ్బంది, రైతులతో కలిసి లీలావతి ఎంతో సమర్థంగా విధులు నిర్వహించారని చెప్పారు. అనంతరం ఆమెను దుశ్శాలువాతో సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. సూపర్‌వైజర్లు జి.విజయదుర్గారావు, పాతాళం శ్రీనివాసరావు రావికమతం, మాడుగుల, బుచ్చెయ్యపేట, చోడవరం మండలాలకు చెందిన వీహెచ్ఏలు, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి రంగాకు ఘన నివాళి



వడ్డాదిలో వంగవీటి రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బుచ్చెయ్యపేట: ఉద్యమనేత వంగవీటి రంగా ఏ ఒక్క వర్గానికి చెందిన వ్యక్తి కాదని అందరివాడిగా గుర్తింపు పొందారని మండల వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి,డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్ధనరావు అన్నారు. శుక్రవారం వంగవీటి మోహనరంగా జయంతి సందర్భంగా వడ్డాదిలో ఆయన విగ్రహానికి వైఎస్సార్‌సీపీ,టీడీపీ, జనసేన,బీజేపీ,కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రంగా కుల,మతాలకు అతీతంగా పనిచేశారన్నారు. అనంతరం స్వీట్లు,పండ్లు పంపిణీ చేశారు. దొండా సన్యాసిరావు, దొండా గిరిబాబు,సయ్యపురెడ్డి సత్యనారాయణ,వీర్ల సురేష్,శిరిగిరిశెట్టి శ్రీరామూర్తి,దొండా సాయి,అదట్రా రమేష్,హరి పాల్గొన్నారు.

నవోదయకు ఎంపిక



పూర్ణచంద్

కె.కోటపాడు : కె.కోటపాడుకు చెందిన కొయ్యి పూర్ణచంద్ నవోదయకు ఎంపికయ్యాడు. మంచి మార్కులు పొందడంతో నవోదయలో ఆరవ తరగతిలో సీటు సాధించినట్టు స్థానిక వేణు విద్యానికేతన్ పాఠశాల డైరెక్టర్ బొడ్డు వేణు తెలిపారు.

వ్యవసాయ విద్యుత్ సరఫరాలో మార్పులు

నర్సీపట్నం: వ్యవసాయ విద్యుత్ సరఫరాలో మార్పులు చేసినట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అప్పారావు తెలిపారు. ఏపీ ట్రాన్స్‌కో 220 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఈ మార్పు చేసినట్టు పేర్కొన్నారు. నర్సీపట్నం, రోలుగుంట, నాతవరం, కోటవురట్ల, గొలుగొండ, రావికమతం మండలాల్లో ఈ నెల 6వ తేదీ నుంచి తెల్లవారుజాము 4 గంటల నుంచి ఉదయం 10గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు విడతలుగా త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపిస్తున్న విషయాన్ని వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

మాకవరపాలెం: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి సందీప్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని గిడుతూరు, బయ్యవరంలలో ఆయన శుక్రవారం పర్యటించారు. స్థానికంగా పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై స్థానికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో క్లోరినేషన్ చేసిన నీటినే ప్రజలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ బాలదొర, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గంజాయి తరలింపు మార్గాల్లో డ్రోన్ సర్వే

రోలుగుంట: మండలంలో పూర్తిస్థాయిలో గంజాయి రవాణాను అరికట్టేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా మండలాన్ని ఆనుకుని ఉన్న ఏజెన్సీ గ్రామాలైన డౌనూరు,చింతపల్లి, కొండసంత, పెదపేట మీదుగా గైరంపేట వరకు కాలినడకన గంజాయి తీసుకొచ్చే మార్గాలు, కాలి బాటల్లో సంచరించే వ్యక్తుల కదలికలు పరిశీలించేందుకు కొత్తకోట సీఐ కోటేశ్వరరావు, రోలుగుంట ఎస్ఐ రామకృష్ణారావు శుక్రవారం డ్రోన్‌తో సర్వే చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మార్గాల్లో డ్రోన్‌తో నిరంతరం నిఘా పెడతామని తెలిపారు.